
epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:37

24 క్యారెట్లు 153,330.00 | కిలో వెండి 2,55,000.00 | chourastha Digitals | 23.09.2026 బుధవారం, హైదరాబాద్



పనిచేస్తూ చదువుకోవడం చిన్నతనం కాదు. సిగ్గుపడాల్సిన విషయమూ కాదు. ఆ పద్ధతి వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. చదువు నిరాటంకంగా కొనసాగుతుంది. తమ కాళ్ల మీద తాము నిలబడటం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది, వారికి శ్రమ విలువ తెలుస్తుంది.

**భావూరావ్ పాటిల్**
సంఘ సంస్కర్త



## ఆదిలాబాద్
# రిమ్స్‌లో అగ్ని ప్రమాదం
## ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదం

- ఏసీ పేలి ముగ్గురు నవజాత శిశువులు మృతి
- అర్ధరాత్రి ఉరుకులు పరుగులు
- 24 మందికి అస్వస్థత ..
- ప్రయివేటు ఆస్పత్రులకు తరలింపు
- విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఆస్పత్రిని సందర్శించినవైద్యారోగ్య శాఖ మంత్రి
- సమగ్ర విచారణ చేపడతాం
- మంత్రి దామోదర రాజనర్సింహ



2లో

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి కండ్లు కూడా సరిగా తెరవని నవజాత శిశువులు చికిత్స పొందుతున్న ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రంలో ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. వైద్య సిబ్బంది కేకలు వేస్తూ బయటకి వచ్చి ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు వస్తున్నాయని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ విభాగానికి చేరుకుని 27 మంది నవజాత శిశువులను కాపాడారు. అందులో ఒకరు అప్పటికే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణం కోల్పోయారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో



## ఆదాయానికి మించి
# ఆస్తుల కేసు

- 7 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు
- దాదాపు పది గంటలకు పైగా సాగిన సోదాలు
- నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ అరెస్టు
- సోదాల్లో భారీగా స్థిర, చరాస్తుల గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ.80 కోట్లకు పైగా
- గతంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి లక్ష్మీ భాస్కర్‌పై అవినీతి ఆరోపణలు

2లో

## జల వివాదంలో థర్డ్ పార్టీలు
# జోక్యం చేసుకోలేవు

- మూడో పక్షం పిటిషన్లను స్వీకరించడం అసాధ్యం
- సుప్రీంకోర్టు
- కర్ణాటకకు అదనంగా 70 టీఎంసీల కావేరీ జలాలు కేటాయించాలి
- ప్రైవేట్ సొసైటీ దాఖలు చేసిన రిట్ పిటిషన్
- కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు పోరడుతున్నాయి
- నదీ జలాల కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే హక్కు



2లో



## మూడు రాష్ట్రాల్లో
# మోగిన ఎన్నికల నగారా

- అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు
- మూడు రాష్ట్రాల్లో 12 స్థానాలకు పోలింగ్ ..
- అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఈనెల 29న నోటిఫికేషన్
- నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబర్ 6



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ , పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. రాజ్య సభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రక టించింది. ఉత్తర్‌ప్ర దేశ్‌లో 10 స్థానాలు,

।మిగతా 2 లో।



## 2020 ఢిల్లీ
# అల్లర్ల కేసు


- షర్జీల్ ఇమామ్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు
- 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఇమామ్‌కు ఊరట
- ఇద్దరు బంధువుల వివాహాలకు హాజరయ్యేందుకు - 7 రోజుల మధ్యంతర బెయిల్
- బెయిల్‌ను వ్యతిరేకించిన ఢిల్లీ పోలీసులు
- ఇమామ్ కుటుంబ సభ్యులు మినహా ఇతరులను కలవద్దు

2లో

# రాజధానిలో భారీ వర్షం
## బంగాళాఖాతంలో వాయుగుండం

2లో


- ఆరెంజ్ హెచ్చరికలు జారీ
- రహదారులపైకి ఫుల్ నీళ్లు
- మాదాపూర్, టోలీచౌక్ వంతెనపై ట్రాఫిక్ జామ్
- సహాయక బృందాలను సిద్ధంగా ఉంచండి
- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి



# రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ

- నగదు లెక్కింపు గదిలోనే అక్రమాలు
- సుప్రీంకోర్టుకు ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక
- ఎనిమిది మంది నిందితులు గుర్తింపు
- ఒక్కొక్క నిందితుడి పాత్రపై దర్యాప్తు
- ఆర్థిక లావాదేవీలు, ఆస్తులపైనా నిఘా

2లో



# ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం అర్ధ రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి కండ్లు కూడా సరిగా తెరవని నవజాత శిశువులు చికిత్స పొందుతున్న ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రంలో ఏసీలో షార్ట్‌సర్క్యూట్ తో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. వైద్య సిబ్బంది కేకలు వేస్తూ బయటకి వచ్చి ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు వస్తున్నాయని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ విభాగానికి చేరుకుని 27 మంది నవజాత శిశువులను కాపాడారు. అందులో ఒకరు అప్పటికే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణం కోల్పోయారు.

**అర్ధరాత్రి ఉరుకులు పరుగులు**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లోని ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రంలో సోమవారం 11.45 గంటల సమయంలో కు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ విభాగంలోని రిసెప్షన్ వద్ద ఉన్న ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. అందులోని గ్యాస్ లీకై దట్టమైన పొగ అలుముకుంది. అక్కడున్న వైద్యులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని అయోమయం నెలకొంది. తల్లిదండ్రులు, కుటుంబీకులు కొంతమంది సిబ్బంది లోపలకు వెళ్లి చిన్నారులను ఒక్కొక్కరినీ బయటకు తీసుకొచ్చారు. అప్పటికే చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రుల రోదనలు, చిన్నారుల ఏడుపులతో ఆ వార్డు దద్దరిల్లింది. మిగతా వార్డుల్ల చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, వైద్య సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కొంతమంది సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి నవజాత శిశువులను కాపాడారు. అయినప్పటికీ ఓ శిశువు పొగతో ఊపిరాడక ప్రాణం కోల్పోయింది. ప్రమాద తీవ్రత పెరగకుండా ఆ వార్డులో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఇంక్యుబేటర్లు పనిచేయడం ఆగిపోయాయి. వెంటిలేటర్లపై ఉన్న నలుగురు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే అర్ధరాత్రి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ రిమ్స్‌కు చేరుకుని సంఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులను జిల్లా కేంద్రంలోని ప్రయివేటు చిల్డ్రన్ ఆస్పత్రులకు తరలించారు.





**కండ్లు తెరవక ముందే ఆగిన ఊపిరి**

ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సలీంఖాన్(ఫిర్‌ఖాన్)సబానాఖాన్‌కు శుక్రవారం పాప జన్మించింది. ఏడు నెలలకే పాప జన్మించడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో ఊపిరాడక చిన్నారి మృతి చెందింది. ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెరకు చెందిన షేకుబాయికుమ్ర దినేష్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. ఎనిమిది నెలలకే బిడ్డ పుట్టడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగ వల్ల అస్వస్థతకు గురైన చిన్నారిని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన సబా సమ్రిన్‌తౌఫిక్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. బరువు 1100 గ్రాములే ఉండటంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగతో ఊపిరాడక చిన్నారి అస్వస్థతకు గురైంది. మొదట జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నిర్మల్, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. అక్కడికి చేరుకునే సమయంలోనే చిన్నారి మృతిచెందింది. వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో మంగళవారం రిమ్స్‌కు చేరుకున్నారు. ఎస్ఎన్‌సీయూతో పాటు పలు వార్డులను పరిశీలించారు. రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని తెలిపారు. దాదాపు గంటకుపైగా పలువురు రోగులతో మాట్లాడి సంఘటన తీరు అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ ఆడిట్‌లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లో అందే నివేదిక ఆధారంగా తగు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా 150 పడకలతో కూడిన మాతా శిశుసంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు. వంద రోజుల్లో రిమ్స్ ప్రక్షాళన చేపట్టి రూపురేఖలు మార్చుతామన్నారు. ఇలాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

# ఆదాయానికి మించి ఆస్తుల కేసు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఎర్రగడ్డలోని ఆయన నివాసంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో దాదాపు పది గంటలకు పైగా సాగిన సోదాలు ముగిశాయి. సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులను గుర్తించిన ఏసీబీ పత్రాల ప్రకారం వాటి విలువను రూ.6.13 కోట్లుగా తేల్చారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ.80 కోట్లకు పైగా ఉండొచ్చని ఏసీబీ అంచనా వేసింది. బ్యాంకు డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, బంగారం, ఖరీదైన కార్లు, బైకులతో పాటు అనేక ప్రాంతాల్లో ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించింది. అరెస్ట్ చేసిన లక్ష్మీ భాస్కర్‌ను ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి అనంతరం రిమాండ్‌కు తరలించనున్నారు. నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ ఎర్రగడ్డలోని ఆయన నివాసంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. బంధువులు, స్నేహితులు, బినామీలు, ఇతర అనుచరులకు సంబంధించిన ప్రాంతాల్లోనూ తనిఖీలు చేపట్టింది. సోదాల్లో కుకట్‌పల్లిలో హైరిజ్ గేటెడ్ కమ్యూనిటీలో ఒక ఫోర్ బెడ్‌రూమ్ ఫ్లాట్, మరో రెండు ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, అలాగే మణికొండ, పేట్‌బషీరాబాద్, కుకట్‌పల్లిలో ఐదు డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించింది. యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట్‌లో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 చదరపు గజాల స్థలం ఉన్నట్లు గుర్తించింది. బ్యాంకు ఖాతాల్లో రూ.41 లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షల డిపాజిట్లు, ప్రైవేట్ సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు, మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.29.55 లక్షలు ఉన్నట్లు తేల్చింది. 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు, జాగ్వార్, ఆడి, టాటా నెక్సాన్ కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా, యమహా నాలుగు ద్విచక్ర వాహనాలు, సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు కూడా గుర్తించింది.

**చీటింగ్ కేసులు నమోదు**

ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ.6.13 కోట్లుగా ఏసీబీ వెల్లడించింది. అయితే వీటి మార్కెట్ విలువ పత్రాల్లో ఉన్న విలువ కంటే అనేక రెట్లు ఎక్కువగా ఉంటుందని, బహిరంగ మార్కెట్‌లో రూ.80 కోట్లకు పైగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. అంతేకాదు వివాదంలో ఉన్న ఓ ఫ్లాట్‌ను కొనుగోలు చేసేందుకు భాస్కర్ రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు, మరో రూ.1.33 కోట్లను వివిధ వ్యక్తులకు చేతి రుణాలుగా ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. అదనపు ఆస్తులపై ఇంకా ధ్రువీకరణ కొనసాగుతోంది. సోదాలు పూర్తయిన అనంతరం లక్ష్మీ భాస్కర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టనున్నారు. గతంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి లక్ష్మీ భాస్కర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. అలాగే పంజాగుట్ట, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కేసులు నమోదైనట్లు కూడా అధికారులు పేర్కొంటున్నారు.




## సిపిఎస్ సమస్య పరిష్కారానికి
# టిజీవో భరోసా

- ఉస్మానియా ఉద్యోగులు, అధ్యాపకుల సమస్యలపై సమన్వయంతో ముందడుగు
- టిజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎలూరి శ్రీనివాసరావు

**హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:**

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యోగులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ నాయకత్వంతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, బి. వెంకటయ్య, డా. రామారావు పాల్గొన్నారు. అలాగే టిజీవో మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన నాయకులు డా. గండూరి వెంకట్, ఎం.బి. కృష్ణ యాదవ్, డా. చలమల్ల వెంకటేశ్వర్లు,అబ్దుల్ ఖాదీర్ ఖాన్, అక్బర్ బేగ్, కుమార్ బి. పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యోగులు, అధ్యాపకులకు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న CPS/OPS (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్/ఓల్డ్ పెన్షన్ స్కీమ్) అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమస్యతో పాటు ఉద్యోగులు, అధ్యాపకుల సంక్షేమానికి సంబంధించిన ఇతర అంశాలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. CPS/OPS సమస్య పరిష్కారానికి సంబంధించి సంబంధిత ప్రభుత్వ శాఖలు, అధికారులతో చర్చించి, ఉద్యోగులు మరియు అధ్యాపకుల న్యాయబద్ధమైన ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని TGOs నాయకత్వం హామీ ఇచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యోగులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి TGOs విశ్వవిద్యాలయ నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.

# మూడు రాష్ట్రాల్లో మోగిన ఎన్నికల నగారా

**తరువాయి భాగం**

ఉత్తరాఖండ్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి అక్టోబర్ 16న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది.

**సెప్టెంబర్ 29న నోటిఫికేషన్**

ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోపు పూర్తి చేయాలని ఈసీ నిర్ణయించింది. రాజ్యసభ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యం గుర్తులను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే నిర్దిష్ట వైలెట్ రంగు స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని ఈసీ స్పష్టం చేసింది. ఇతర పెన్నులతో గుర్తులు వేయకూడదని పేర్కొంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పరిశీలకులను నియమించి, మొత్తం ప్రక్రియను పర్యవేక్షించనున్నట్టు తెలిపింది. నవంబర్ 25తో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి సహా పలువురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. వీరిలో ఉత్తర ప్రదేశ్ నుంచి బీజేపీ నాయకులు అరుణ్ సింగ్, గీతా షాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బిఎల్ వర్మ, సీమా ద్వివేది, ఎస్పీ నేత రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీకి చెందిన రాజీ గౌతమ్ ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాజ్యసభ స్థానం రుక్మిణి మల్లిక్ రాజీనామాతో 2026 జులై 16న ఖాళీ అయింది. ఈ స్థానానికీ ఇదే షెడ్యూల్ ప్రకారం ఉపఎన్నిక జరగనుంది. ప్రస్తుతం ఉన్న అంచనా ప్రకారం.. అసెంబ్లీలో ఉన్న స్థానాలను బట్టి యూపీలోని 10 స్థానాల్లో 8 బీజేపీ, రెండు స్థానాలు సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి. సిట్టింగ్ రాజ్యసభ ఎంపీని కలిగి ఉన్న బీఎస్పీ ఒక్క సీటు కూడా గెలుచుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఆ పార్టీకి యూపీ అసెంబ్లీలో సభ్యులు లేనందున రాజ్యసభ సీటు దక్కే అవకాశం లేదు. బీఎస్పీకి ఇది క్లిష్టకాలమనే చెప్పుకోవాలి. దీనికి యూపీ అసెంబ్లీలోని ఉభయ సభల్లో, పార్లమెంట్ ఉభయ సభల్లో ఒక్క సభ్యుడూ లేరు. 1989 తరువాత బీఎస్పీకి ఈ పరిస్థితి రావడం ఇదే తొలిసారి. ఇక, ఉత్తరాఖండ్‌లో ఉన్న ఒక్క స్థానాన్ని బీజేపీ దక్కించుకోనుంది. ఆ పార్టీకి అసెంబ్లీలో భారీ మెజారిటీ ఉన్నందున ఆ సీటు బీజేపీకే దక్కనుంది. పశ్చిమ బెంగాల్‌లో కూడా ఈ సీటును బీజేపీయే గెలుచుకోనుంది. ఈ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరుగుతుండటంతో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.





## జల వివాదంలో థర్డ్ పార్టీలు
# జోక్యం చేసుకోలేవు

**-తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

కావేరీ జలాల్లో కర్ణాటకకు 70 టీఎంసీల నీటిని అదనంగా కేటాయించాలంటూ ఓ ప్రైవేట్ సొసైటీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్‌పార్టీలు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఇలా సొసైటీల పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ముగియవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే చట్టపరంగా పోరాడుతున్నాయన్న కోర్టు రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని తేల్చి చెప్పింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే హక్కు ఉంటుదని పునరుద్ఘాటించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కావేరి కేసుల నేపథ్యంలో కొత్త వ్యాజ్యాలకు తావు లేదంటూ పిటిషన్ కొట్టేసింది.

ఇదిలా ఉండగా, కావేరీ నీటి విడుదలపై కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టుకు తన వాదనను వినిపించింది. ఆగస్టు 31 నాటికి తమిళనాడుకు నిర్దేశించిన పరిమాణం కంటే ఎక్కువ నీటిని విడుదల చేసినట్లు కర్ణాటక తెలిపింది. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తూ, తమిళనాడు వైపు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించింది. ఆగస్టు 25న సీడబ్ల్యూఎంఏ కీలక నిర్ణయం తీసుకుంది. కావేరీ వాటర్ రెగ్యులేషన్ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ) చేసిన సిఫార్సును సమర్థిస్తూ, తమిళనాడుకు 15 రోజుల పాటు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కర్ణాటక నిర్ధారించాలని ఆదేశించింది. బిలిగుండ్లులో ఈ ప్రవాహాన్ని కొనసాగించాలని సూచించింది. ఈ నిర్ణయం సీడబ్ల్యూఎంఏ 56వ సమావేశంలో తీసుకున్నారు.

**నీటి బకాయిలపై తమిళనాడు అభ్యంతరం**

అయితే కర్ణాటక నుంచి నీటి విడుదల విషయంలో తమకు రావాల్సిన వాటాలో లోటు ఏర్పడిందని తమిళనాడు ప్రభుత్వం చెబుతోంది. సీడబ్ల్యూఎంఏ దృష్టికి నీటి బకాయిల అంశాన్ని తీసుకెళ్లినా, ఆ విషయంలో ప్రత్యేకంగా ఎలాంటి ఆదేశాలు వెలువడలేదని తమిళనాడు తరపు న్యాయవాదులు గత విచారణలో తెలిపారు. కావేరీ జలాల విడుదలపై తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వర్షాభావ పరిస్థితుల్లో తమకు రావాల్సిన నీటి వాటా అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో కర్ణాటక నుంచి తక్షణమే నీటిని విడుదల చేయించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

**ఇప్పటికే కొనసాగుతున్న న్యాయపోరాటం**

ఆగస్టు 25న సుప్రీంకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి, తన నీటి విడుదలకు సంబంధించిన ఫిర్యాదును సీడబ్ల్యూఎంఏ ముందు ప్రస్తావించుకోవచ్చని సూచించింది. ఆ తర్వాత సీడబ్ల్యూఎంఏ సమావేశమై 9,000 క్యూసెక్కుల ప్రవాహాన్ని 15 రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుతం కూడా కావేరీ నీటి పంపిణీ అంశంపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతోంది. సెప్టెంబరు 18న తమిళనాడు ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించి కర్ణాటక నుంచి తమకు రావాల్సిన నీటి వాటాను విడుదల చేయాలని కోరింది. మేట్టూరు రిజర్వాయర్‌లో పరిమిత నీటి నిల్వ మాత్రమే ఉందని, అది సుమారు 30 రోజులకు సరిపడే స్థాయిలో ఉందని రాష్ట్రం పేర్కొంది.

బ్రిటీష్ పాలనా కాలంలోనే కావేరి వివాదం మూలాలు ఉన్నాయి. 1892లో, తరువాత 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ మధ్య రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. దాని ప్రకారం దిగువన ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం లభించిందని, ఎగువన ఉన్న మైసూర్ అభివృద్ధికి పరిమితులు విధించారని కర్ణాటక వాదిస్తోంది. కావేరీ నదీజలాల వివాదాన్ని పరిష్కరించడం కోసం 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జల వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 17 ఏళ్ల విచారణ అనంతరం 2007లో ట్రిబ్యునల్ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే దీనిపై ఇరు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. 2018లో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. అంతర్రాష్ట్ర నదులు ఏ ఒక్క రాష్ట్రానికీ చెందినవి కావని, అవి జాతీయ వనరులని స్పష్టం చేసింది. సాధారణ సంవత్సరాల్లో నీటి పంపిణీపై మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, తీవ్ర కరవు పరిస్థితుల్లో నీటిని ఏ ప్రమాణాలతో పంచుకోవాలనే విషయంలో ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావడం లేదు.

# 2020 ఢిల్లీ అల్లర్ల కేసు

**తెలంగాణ చౌరస్తా,స్టేట్ బ్యూరో :**

2020 దేశ రాజధాని ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న షర్జీల్ ఇమామ్‌కు ఏడు రోజుల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది ఢిల్లీ కోర్టు. తన ఇద్దరు బంధువుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు అక్టోబర్ 4 నుంచి 10 వరకు తాత్కాలికంగా విడుదల చేసేందుకు అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బజ్‌పాయ్ అనుమతించారు. అయితే, మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు పలు షరతులు విధించింది.

షర్జీల్ ఇమామ్ తరపున న్యాయవాదులు అహ్మద్ ఇబ్రహీం, ఆయేషా జైదీ మధ్యంతర బెయిల్ కోసం దరఖాస్తు చేశారు. తన బంధువులు దానిష్ ఇమామ్, ఫహద్ ఇమామ్ వివాహ వేడుకలకు హాజరు కావాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వివాహాల్లో ఒకటి అక్టోబర్ 4న ఢిల్లీలో, మరొకటి అక్టోబర్ 7న బిహార్‌లోని ససారాంలో జరగనున్నట్లు కోర్టుకు వివరించారు. తొలుత సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 13 వరకు రెండు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరినప్పటికీ, కోర్టు ఏడు రోజులపాటు మాత్రమే అనుమతి ఇచ్చింది. రూ.50 వేల బెయిల్ బాండ్‌తో పాటు అదే మొత్తానికి ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. అక్టోబర్ 10 సాయంత్రం జైలు అధికారుల ఎదుట షర్జీల్ ఇమామ్ తిరిగి లొంగిపోవాలని స్పష్టం చేసింది. అలాగే కేసుకు సంబంధించిన వ్యక్తులు లేదా సాక్షులను సంప్రదించకూడదని, సోషల్ మీడియాను ఉపయోగించకూడదని ఆదేశించింది. కుటుంబ సభ్యులు మినహా ఇతరులను కలవకూడదని కూడా షరతు విధించింది. ఇది షర్జీల్ ఇమామ్ దాఖలు చేసిన రెండో మధ్యంతర బెయిల్ పిటిషన్ అని కోర్టు గుర్తించింది. ఈసారి అభ్యర్థన తన సొంత బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు కావడంతో, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.



షర్జీల్ ఇమామ్ అభ్యర్థనపై ఢిల్లీ పోలీసులు తమ స్పందనను కోర్టుకు సమర్పించారు. వివాహాలు జరగనున్న విషయం వాస్తవమేనని ధ్రువీకరించారు. అయితే ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనిరుధ్ మిశ్రా మధ్యంతర బెయిల్‌ను వ్యతిరేకించారు. కేసులో నిందితుడిపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని, గతంలో అతడి రెగ్యులర్ బెయిల్ అభ్యర్థనలను కోర్టు తిరస్కరించిందని ప్రాసిక్యూషన్ వాదించింది. వివాహ కార్యక్రమానికి నిందితుడి వ్యక్తిగత హాజరు లేదా ఆర్థిక సహాయం తప్పనిసరి కాదని పేర్కొంది. అంతేకాకుండా, ఇలాంటి కారణంతో బెయిల్ ఇస్తే భవిష్యత్తులో ఇతర బంధువుల వివాహాల పేరుతో కూడా పదేపదే మధ్యంతర బెయిల్ కోరే అవకాశం ఉంటుందని ప్రాసిక్యూషన్ అభ్యంతరం తెలిపింది.

**ఉపా కింద కేసు నమోదు**

కాగా ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, ఇమామ్‌తో పాటు మరికొందరిపై ఉగ్రవాద నిరోధక చట్టం, యూఏపీఏ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టం సీఏఏకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘనటలో దాదాపు 53 మంది ప్రాణాలు కోల్పోయారు. 700 మందికి పైగా గాయపడ్డారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మను కూడా అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఆయన హత్య కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత తాహిల్ హుస్సేన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ యూఏపీఏ కింద ఛార్జిషీటు నమోదు చేశారు.

ఇప్పుడు షర్జీల్ ఇమామ్‌కు మధ్యంతర బెయిల్ లభించినప్పటికీ, ఆయన రెగ్యులర్ బెయిల్ వ్యవహారం ఇంకా కోర్టుల పరిధిలోనే ఉంది. ఢిల్లీ కోర్టు జూలైలో షర్జీల్ ఇమామ్, ఉమర్ ఖలీద్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు సెప్టెంబర్ 30న విచారణ చేపట్టనుంది. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ బెయిల్ పిటిషన్ల విచారణను సెప్టెంబర్ 21న హైకోర్టు వాయిదా వేసింది.



# కుంట్లూరు రవిశంకర్ కాలనీలో వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**



కుంట్లూరులోని రవిశంకర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉబ్బ సురేష్, కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా కాలనీలోని గణేష్ మండపంలో స్వామివారికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం నృత్యంజలి డాన్స్ అకాడమీ గురూజీ ప్రణవి పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. చిన్నారుల ప్రతిభను చూసి కాలనీవాసులు,భక్తులు తమ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు కాలనీ అసోసియేషన్ తరపున బహుమతులతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతోపాటు భరతనాట్య బృందం చిన్నారులు అనంతుల క్రితిక రెడ్డి,ఊర్వి,సిద్ది శ్రీ,మధు హాసిని,లక్కీ సింగ్, ఆరాధ్య,కిరణ్మయి, ప్రధన్య,మౌనిత, సమన్విత, మనస్వి, చరిత,గౌతమిల తో పాటు కాలనీ మహిళలు,చిన్నారులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# విద్య, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారమే ఎస్టియూ లక్ష్యం

- ఎస్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరవి సుధాకరా చారి

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**



విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్టియూ టీఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరవి సుధాకరా చారి అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టియూ టీఎస్ ) 80వ వసంతోత్సవాలను ఈనెల 27న హైదరాబాద్ నాగోలులోని శుభం కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హరిపిరాల హైస్కూల్ తో పాటు పలు పాఠశాలల్లో సంఘం ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ సంఘం 1947లో స్థాపించబడిందని, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు విద్యాభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు, సేవా భద్రత వంటి అంశాలపై అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. విద్యారంగంలో వచ్చిన అనేక మార్పులు, సంస్కరణలో ఎస్టియూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఉద్యోగులకు 317 జీవో తో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ను రద్దు చేసి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలు, 6 డిఏలు ప్రభుత్వం నేటికీ విడుదల చేయకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు మెరుగైన పిఆర్సిని అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న బకాయిల కోసం వెంటనే 20 వేల కోట్లు మంజూరు చేయాలని, ఆరోగ్య కార్డులను పూర్తిస్థాయిలో అమలు పరచడం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 27న జరిగే రాష్ట్రస్థాయి 8వ వసంత ఉత్సవాలకు జిల్లా నుండి ఎస్టియూ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సంఘ శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఎస్టియూ దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్ఎం బి.వెంకటేశ్వరరావు, ఎస్టియూ జిల్లా కార్యదర్శి బి. సంపత్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు జి.యాకయ్య,ఉపాధ్యాయులు మధుకర్ రెడ్డి, రాజేశ్వర్,కుమార్,శంకర్, రవీందర్,రాజు,కోటేశ్వర్, రవి,రమేష్,అనురాధ, సరిత,లత,సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



# నిమజ్జనం ప్రశాంతంగా జరుపాలి

- డీజేలకు అనుమతి లేదు.
- భారీ శబ్దాలతో ప్రాణాలకు ముప్పు
- హుస్సేమియా వాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ గజ్జి కృష్ణ

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు.కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని హుస్సేమియా వాగు పరిసరాల్లో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఘాట్ ను మంగళవారం ఆయన పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు,గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు.మండల కేంద్రంలోని వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంతో పాటు యాదవ సంఘం,ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఏసీపీ గజ్జి కృష్ణ సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.

**డీజేలకు అనుమతి లేదు...**

నిమజ్జన ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని ఏసీపీ స్పష్టం చేశారు. భారీ శబ్ద కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా వృద్ధులు,చిన్నారులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ప్రాణాలకు ముప్పు కలిగించే అవకాశం ఉందన్నారు. పోలీసుల సూచనలు,నిబంధనలు పాటిస్తూ గణేష్ నిమజ్జనాన్ని సురక్షితంగా నిర్వహించాలన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద విద్యుత్,వెలుతురు, రాకపోకలు,భద్రత తదితర అంశాలను పోలీసులు పర్యవేక్షించనున్నారు.భక్తులు పోలీసులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఏసీపీ కోరారు.ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై గట్ల సుధాకర్,పోట్కపల్లి ఎస్సై సనత్ కుమార్,మాజీ ఎంపీపీ గొపగోని సారయ్య గౌడ్,సర్పంచ్ బంగారి రమేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండల అధ్యక్షుడు యంసాని రాఘవులు,కార్యదర్శి కోలేటి అశోక్,యాదవ సంఘం మండల అధ్యక్షుడు అల్లంల దేవేందర్, వార్డు సభ్యులు,పోలీస్ సిబ్బంది,పాల్గొన్నారు.



# క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**కాల్వశ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**




పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 17,18 తేదీల్లో,అలాగే 21వ తేదీన ఐటీఐ కళాశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో మల్యాల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపర్చారు.జిల్లా స్థాయి పోటీలకు 9 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

**అండర్-17 కబడ్డీ – బాలికలు**

డి. హర్షతేజ - మొదటి సంవత్సరం బైపీసీ,ఎస్.లాస్య - మొదటి సంవత్సరం ఎంపీసీ,ఎస్.వైష్ణవి - 10వ తరగతి,అండర్17 కబడ్డీ - బాలురు,పి.సుమంత్ - 10వ తరగతి,అండర్14 షాట్‌పుట్, పి.దేవిప్రసాద్ - 9వ తరగతి,అండర్17 షాట్‌పుట్,చి.విషాల్ - 10వ తరగతి,అండర్17 లాంగ్ జంప్,పి.సుశాంత్ - 10వ తరగతి,అండర్17 100 మీటర్ల పరుగు,టి.ధర్మ - 10వ తరగతి

**రాష్ట్ర స్థాయి కబడ్డీకి కె. పూజ ఎంపిక...**

పాఠశాల రెండవ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని కె.పూజ, పెద్దపల్లి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల పోచయ్య మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లా,రాష్ట్ర స్థాయిలో మరింత ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అనుముల పోచయ్య, ఉపాధ్యాయులు,పీఈడీ విద్యార్థులు అభినందించి, తదుపరి స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## గౌతమేశ్వర ఆలయ చైర్మన్

# గుండా రాజుకు ఘన సన్మానం

- సత్కరించిన జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్,
- ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శేఖర్

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**



మంథని పట్టణానికి చెందిన మాజీ వార్డు మెంబర్ గుండా రాజు గౌతమేశ్వర దేవాలయం చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్, పెద్దపల్లి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిల్లి చంద్రశేఖర్ మంథనిలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బిసి వర్గానికి చెందిన గుండా రాజును ప్రముఖ పుణ్యక్షేత్రమైన గౌతమేశ్వర ఆలయ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం నూతన చైర్మన్ విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఇన్‌చార్జ్ అన్నవేని సదయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బండ్లగూడ వైన్స్ హత్య కేసులో ప్రధాన సూత్రధారి సహా

# మరో ఇద్దరి నిందితుల అరెస్ట్

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**



బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో గతవారం చోటుచేసుకున్న రౌడీషీటర్ నయీమ్ దారుణ హత్య కేసులో నాగోల్ పోలీసులు మంగళవారం కీలక ప్రగతి సాధించారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కె. ఉమా మహేష్ అలియాస్ జేకే మహేష్ (34) తో పాటు మరో ఇద్దరు నిందితులు మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్‌బీ నగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**పాత కక్షలే హత్యకు కారణం..**

పోలీసుల కథనం ప్రకారం..ఖమ్మం జిల్లాకు చెందిన నయీమ్, ఉమా మహేష్‌లు బాల్య స్నేహితులు.గతంలో అనేక నేరాల్లో భాగస్వాములు కావడంతో ఇద్దరిపై ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్లు నమోదయ్యాయి.కొంతకాలంగా వివిధ వ్యాపారాలలో ఇద్దరి మధ్య ఆర్థిక విభేదాలు తలెత్తడంతో శత్రుత్వం పెరిగింది.ఈ క్రమంలో నయీమ్‌ను మట్టుబెట్టేందుకు ఉమా మహేష్ ఈ నెల 13న ఖమ్మంలోని ఒక హోటల్‌లో తన అనుచరులతో కలిసి పక్కా పథకం రచించాడు.

**కళ్లలో కారం చల్లి వేటకొడవళ్లతో దాడి..**

పథకం ప్రకారం ఈ నెల 14న హైదరాబాద్ చేరుకున్న నిందితులు, మున్నా ద్వారా నయీమ్ ఆచూకీ తెలుసుకున్నారు. బండ్లగూడలోని సుప్రీం వైన్స్‌లో నయీమ్ ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి చేరుకున్నారు. ఒక్కసారిగా దాడికి దిగి నయీమ్ కళ్లలో కారం చల్లి, సిట్టింగ్ ఏరియాలోనే వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు.

**11కు చేరిన అరెస్టుల సంఖ్య..**

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఆదేశాలతో ఎల్‌బీ నగర్ డీసీపీ బి.అనురాధ, ఏసీపీ రవీందర్‌రెడ్డిల పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.ఈ కేసులో ఇప్పటికే 8 మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. తాజాగా ప్రధాన సూత్రధారితో సహా మరో ముగ్గురిని అరెస్ట్ చేయడంతో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య 11కు చేరిందని నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.




# పరిసరాల స్వచ్ఛతతోనే ఆరోగ్యం

- డీఆర్‌డీఏ అధికారిణి ఎం. ఖాళిందిని

**కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ అధికారిని ఎం. కలిందిని, స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ రాఘవులు హాజరై మాట్లాడారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని తెలిపారు. తడి వ్యర్థాలను (పండ్ల తొక్కలు,మిగిలిన ఆహారం) ఆకుపచ్చ డబ్బాలో, పొడి వ్యర్థాలను (ప్లాస్టిక్, కాగితం) నీలిరంగు డబ్బాలో, శానిటరీ వ్యర్థాలను ఎరుపు రంగు డబ్బాలో పురుగుమందులు, వాడిన సూదులు వంటి ప్రమాదకర వ్యర్థాలను నల్ల రంగు డబ్బాలో వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రియాంక, ఎంపీఓ సౌమ్య, ఏపీఎం పద్మ, ఉపసర్పంచ్ రఫిక్ సోహెల్, పంచాయతీ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తి సందడి

- గణపతిని దర్శించిన నాయకులు
- తిరుమలకుంటలో ఘనంగా అన్నసమారాధన..
- భక్తులతో కలిసి భోజనం చేసిన బీఆర్ఎస్ నేతలు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**

అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.కార్యక్రమానికి బీఆర్ఎస్ కీలక నాయకులు కాసాని నాగశేష పద్మ, కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి-డాక్టర్ ప్రసాద్ రావు , మొటూరి మోహన్, పాలవలస జీవన్‌రావు, అరిపల్లి గోవింద్, కునుసోతు నవీన్, రంజా తదితరులు హాజరయ్యారు. వారు ముందుగా గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేస్తూ ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ఉత్సవాల విశేషాలు, గ్రామాభివృద్ధి అంశాలపై ముచ్చటించారు. అనంతరం కక్కిరాల పురుషోత్తం-రాజమ్మ దంపతుల స్వగృహాన్ని సందర్శించి ఆత్మీయంగా పలకరించారు. అలాగే గడ్డం పుల్లారావు-లక్ష్మి దంపతుల నివాసానికి వెళ్లి తేనేటి విందులో పాల్గొని కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో భక్తి వాతావరణం నడుమ కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజలను ఆకట్టుకుంటుండగా, అన్నసమారాధన కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు

# బంజారా కాలనీలో రూ.6 కోట్లతో స్మశానవాటిక అభివృద్ధి

- మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలన

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా;**



హయత్ నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో రూ. 6 కోట్ల నిధులతో నిర్మించిన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.తన హయాంలో మంజూరైన ఈ నిధులతో చేపట్టిన పనుల నాణ్యత, మౌలిక వసతులపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూబిడి మల్కాజ్గిరి మేనేజర్ సునంద,డైరెక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు ఎస్.ఎస్. అన్వర్ విరాళం

- 23 మండపాలకు బియ్యం పంపిణీ
- ఒక్కో మండపానికి 25 కిలోల చొప్పున 575 కిలోల బియ్యం అందజేత

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ దాతృత్వాన్ని చాటుకున్నారు. కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 23 వినాయక మండపాల నిర్వాహకులకు ఒక్కో మండపానికి 25 కిలోల చొప్పున మొత్తం 575 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్. అన్వర్ మాట్లాడుతూ.. కమాన్‌పూర్ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని విఘ్నేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగేలా విఘ్నాలు తొలగించాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. భక్తులు, మండపాల నిర్వాహకులు గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.



# నిమజ్జనానికి క్షేమంగా వెళ్లి.. సురక్షితంగా తిరిగి రావాలి

- 'యువతరం యూత్' మహా అన్నదానంలో
- ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 'యువతరం యూత్' ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం భక్తుల శ్రద్ధాంజలుల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్ భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలను ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న యూత్ సభ్యులను అభినందించారు. అనంతరం వినాయక నిమజ్జన ఊరేగింపులపై పలు కీలక సూచనలు నిమజ్జన సమయాల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.సంప్రదాయ వాయిద్యాలకే ప్రాధాన్యం శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేలకు దూరంగా ఉంటూ, బ్యాండ్, సన్నాయి వంటి సంప్రదాయ వాయిద్యాలను మాత్రమే వినియోగించాలి.సురక్షిత ప్రయాణం నిమజ్జన వేడుకలకు వెళ్లే ప్రతీ ఒక్కరూ తమ కోసం ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారని గుర్తుంచుకుని క్షేమంగా వెళ్ళి, సురక్షితంగా తిరిగిరావాలి.ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో సంతోషంగా ముగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ విలేకరి చదలవాడ సూరి, బండిపల్లి కిరణ్ కుమార్ దంపతులు, బొట్టు శ్రీను, పదాల భవాని ప్రసాద్, మూడ్ నరేష్, కడారి మోహన్ రావు, కాదశి శంకర్, వేముల సురేష్, పుట్ట రాంచందర్, దూడపాక శివప్రసాద్ దంపతులు, ట్రాఫిక్ కానిస్టేబుల్ పాషా, యువతరం యూత్ సభ్యులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రైతులకు విద్యుత్ కొరత లేకుండా అందించాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి కోటగిరి యాకాంతం




**తొర్రూరు తెలంగాణ చౌరస్తా:** విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన వ్యక్తం చేస్తూ తొర్రూరు మండలంలోని పాత్రికేయ సమావేశంలో కోటగిరి యాకాంతం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో తరచూ విద్యుత్ కోతలు రైతులు లబోదిబో అంటున్నారు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తొర్రూరు మండల పరిధిలోని తరచూ విద్యుత్ కోతలు విధించడానికి నిరాశిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా రాస్తా రోకో చేపడతామని అన్నారు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తొర్రూరు మండల కార్యదర్శి కోటగిరి యాకాంతం అన్నారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా లో అంతరాయాలు ఏర్పాటుతో పంటలకు సాగునీరు అందకపోవడంతో పొట్టల మీదకు వచ్చిన వారి ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కరెంటు వస్తు పోవడంతో రైతులు పొలం గట్ల పైన కరెంటు కోసం వేచి చూడవలసి వస్తుంది కాబట్టి విద్యుత్ కోతలు లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్తును ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను వారి డిమాండ్ చేశారు.




# వ్యవసాయ భూములను రసాయన రహిత క్షేత్రాలుగా మార్చాలి

- పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంటలు పండించాలి
- పెద్దపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.శ్రీనాథ్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం రైతు వేదిక లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం మీద గంగారం,కునారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా పెద్దపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏ డి ఏ) ఎం.శ్రీనాథ్ మాట్లాడుతూ....ఈ స్కీమ్ లో ఎంపిక కాబడిన రైతులు తమ వ్యవసాయ భూములను రసాయన రహిత క్షేత్రాలు గా మార్చాలని,పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంటలు పండిస్తూ మంచి ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు.అలాగే రైతులు స్వతహాగా ఘన జీవాంవృతం, ద్రవ జీవామృతం,నిమాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారు చేసుకొని పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వాడాలని అన్నారు.ప్రతి రైతు ఆవులను పశు సంపద ను పెంచుకొని పర్యావరణమును కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి.సంధ్య, సీడ్ సర్టిఫికేషన్ అధికారి కిశోర్ కుమార్,ఏఈఓలు ఎం.సతీష్, ఎం.ఈశ్వర్ రెడ్డి,ఎం.సంకీర్తన, ఎన్.ఎం.ఎన్.ఎఫ్.వాలంటీర్ ఐశ్వర్య,సిఆర్పి సభ్యులు శారద, లావణ్య,రైతులు పాల్గొన్నారు.



# భారీ గణనాథుని నమూనా గీసిన యువ కళాకారుడు

- యువ కళాకారుడిని సన్మానించిన చత్రపతి యువసేన అధ్యక్షుడు సతీష్

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :** పెద్దపల్లికి చెందిన యువ కళాకారుడు వైట్ల రాము చత్రపతి యువసేన ఆధ్వర్యంలో శ్రీ పంచముఖ అవతారంలో రూపొందించిన 63 అడుగుల భారీ మట్టి గణనాథుడి విగ్రహ నమూనాను గీసి అందరినీ ఆకట్టుకున్నాడు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రతిష్టాపించిన భారీ మట్టి వినాయకుడిని చూసుకుంటూ సుమారు రెండు గంటల పాటు శ్రమించి, తన కళా నైపుణ్యంతో అద్భుతమైన చిత్రాన్ని గీసి పలువురి మన్ననలు పొందాడు. ఈ సందర్భంగా చత్రపతి యువసేన వ్యవస్థాపకుడు శివంగారి సతీష్ యువ కళాకారుడు వైట్ల రాముకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రాము మాట్లాడుతూ.. పర్యావరణహిత మట్టి వినాయకుడి ప్రాధాన్యతను కళా రూపంలో ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో విగ్రహ నమూనాను గీసి, పెయింటింగ్ వేసినట్లు తెలిపారు.



# బడి పిల్లల ఆరోగ్యానికి భరోసా

- చిన్నకల్వల ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అల్పాహారం
- విద్యార్థుల భవిష్యత్తుకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- చిన్నకల్వల సర్పంచ్ ఏరుకొండ స్రవంతి - రమేష్ గౌడ్



**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద వర్గాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని సర్పంచ్ ఏరుకొండ స్రవంతి రమేష్ గౌడ్ అన్నారు. హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నకల్వల, అనుబంధ గ్రామమైన ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్రవంతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహారం ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులకు అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు స్కూలుకు హాజరై క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొంగోని కుమార్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు పర్కాల ఎల్లయ్య, మమత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ కల్వల పద్మ, అధ్యాపకులు శ్రీనివాస్, డిఎన్ హరిప్రియ, మహమ్మదీ బేగం, అసిస్టెంట్ టీచర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు

- అన్నదాన కార్యక్రమం,
- వ్యాధిగ్రస్తులకు పండ్ల వితరణ

**మద్దూర్ మున్సిపాలిటీ, తెలంగాణ చౌరస్తా:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు కీ.శే.పరిటాల రవీంద్ర కుమారుడు,ఆయన రాజకీయ వారసుడు, యువనేత,టిడిపి పార్టీ ధర్మవరం ఇంఛార్జ్ అయిన పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో వారి అభిమానులు ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి)వద్ద అన్నదాన కార్యక్రమం,అలాగే రోగులకు పండ్ల వితరణ చేశారు.ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు.రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పరిటాల కుటుంబంతో ఉన్న సత్సంబంధాలు,అంతేకాకుండా పరిటాల శ్రీరామ్ పై ఉన్న ఎనలేని అభిమానంతోనే ఈ వేడుకలు నిర్వహించినట్లు డి.చంద్రకాంత్ తెలిపారు.రానున్న భవిష్యత్ లో పరిటాల శ్రీరామ్ ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాలు జరపబోతున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో డి.చంద్రకాంత్,ఫర్హాన,ధృవనిహల్,భీమమ్మ,వై.అంజి,రవి,శ్రీకాంత్,శ్రీహరి,విజయ్ పలువురు పరిటాల శ్రీరామ్ అభిమానులు పాల్గొన్నారు.



# మొక్కలను నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం

- సర్పంచ్ పోశాల శైలజ-సదానందం గౌడ్


**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ పోశాల శైలజ సదానందం గౌడ్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చల్ల మానససతీష్,ఉయ్యాల శ్రీధర్,విద్యార్థిని,విద్యార్థులు,తదితరులు, పాల్గోన్నారు.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, ఐడి కార్డులు పంపిణీ
- విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి
- గుర్రాంపల్లి సర్పంచ్ తొగరి సంపత్

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సర్పంచ్ తొగరి సంపత్ అన్నారు.మండలంలోని గుర్రాంపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు సర్పంచ్ సంపత్ తల్లి తొగరి లక్ష్మి జ్ఞాపకార్థం మేరకు రూ. 65 వేల విలువైన టై, బెల్ట్, ఐడి కార్డులను విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రణాళికతో చదువుకోవాలని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఏకాగ్రతతో చదువుతూ, ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఉజ్వలంగా తీర్చిదిద్దుతూ, క్రమశిక్షణతో కూడిన బంగారు భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర, కృషి అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుంపేటి రాజేశం, విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఈర్ల సుమిత్ర, కాసర్ల స్వాతి, బుర్ర స్వరూప, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# గణపతి నామస్మరణతో మారుమోగుతున్న మండపాలు

- చెంగిచెర్ల వినాయక మండపాలను సందర్శించిన
- ఏనుగు సుదర్శన్ రెడ్డి, తుప్పత్ ఆనంద్
- ప్రత్యేక పూజల నిర్వహణ
- అన్న ప్రసాద వితరణ ప్రారంభం
- సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

**బోడుప్పల్, తెలంగాణ చౌరస్తా:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్లో 8వ రోజు గణపతి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చెంగిచెర్ల డివిజన్లో పరిధిలోని ఎస్ వై నగర్ కాలనీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బిజెపి నాయకులు తుప్పత్ ఆనంద్ తదితరులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా చెంగిచెర్ల ఆర్ టీ సి కాలనీ, ఎం ఎల్ కాలనీలలో శ్రీ గణపతి మండపాలను దర్శించి ఆ గణనాథుని ఆశీర్వాదం పొందడం పొందారు. అనంతరం ఆయా మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించడం జరిగింది. ప్రతి మండపం దగ్గర పిల్లలు, పెద్దలు, మహిళలు భక్తిశ్రద్ధలతో భజనలు, పూజలు నిర్వహిస్తూ, మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు, భక్తి పాటలతో విశేషంగా ఆకట్టుకుంటున్నారని తుప్పత్ ఆనంద్ అన్నారు. విగ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సకల సౌభాగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అన్ని ర భారత్ విశ్వ గురువుగా చెందాలని ఆకాంక్షించినట్లు తుప్పత్ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, శ్రీ గణపతి మండప నిర్వహకులు, కాలనీ వాసులు, మహిళలు,పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆశ్రమానికి ఆర్థిక సహాయం అందుజేత

- ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో...

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:** సాయి రామ వృథా ఆశ్రమమును ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వారు సందర్శించి వృద్ధులకు అందిస్తున్న సేవలను చూసి, సంతృప్తి చెంది,వినాయక నవరాత్రి ఉత్సవ సందర్భంగా ఆశ్రమ వాసులకు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వారు ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ.... హాస్పిటల్ యాజమాన్యం అందించిన ఈ ఆర్థిక సహాయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.వైద్యశాల యాజమాన్యమునకు,వైద్యశాల అభివృద్ధికి ,ఆ భగవంతుని ఆశీర్వాదములు అన్ని విధాలా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు,హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్స్ అవకాశం

- ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా:** రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 24,25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం తెలిపారు. రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలోనూ ఇప్పటివరకు అడ్మిషన్ పొందని విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ

**-తెలంగాణ చౌరస్తా, state**

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక విషయాలను గుర్తించింది. ఆలయంలోని నగదు లెక్కింపు గది నుంచి డబ్బును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టినట్లు 105 ఘటనలు గుర్తించినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. నగదు వ్యవహారంలో అక్రమాలపై దర్యాప్తు కొనసాగుతుండగా, విలువైన వెండి వస్తువులు, ఇతర విరాళాల విషయంలో మాత్రం తనిఖీల్లో ఎలాంటి తేడాలు గుర్తించలేదని నివేదిక వెల్లడించింది.

ఆలయంలోని యాత్రికుల సౌకర్య కేంద్రం (పీఎఫ్‌సీ)లో ఉన్న నగదు లెక్కింపు గది, ఇతర డిజిటల్ ఆధారాలను సిట్ పరిశీలించింది. సీసీటీవీ ఫుటేజీ, ఇతర డేటా విశ్లేషణలో నగదు లెక్కింపు గది నుంచి అనధికారికంగా డబ్బు తీసుకెళ్లడం లేదా దాచిపెట్టడం జరిగినట్లు భావిస్తున్న 105 సందర్భాలు బయటపడినట్లు నివేదిక పేర్కొంది. ఈ ఘటనల్లో నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న మరికొందరి సహకారం ఉన్నట్లు కూడా వెల్లడైనట్లు సిట్ తెలిపింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను గుర్తించినట్లు స్పష్టం చేసింది. నిందితుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన వివరాలు, వాటిలో వివరణ లేని మొత్తాలు, అనుమానితంగా అక్రమంగా సంపాదించిన డబ్బును పెట్టుబడిగా పెట్టినట్లు భావిస్తున్న స్థిర, చరాస్తుల వివరాలను కూడా సిట్ సేకరించింది.

**ఒక్కొక్క నిందితుడి పాత్రపై దర్యాప్తు**

నగదు అక్రమంగా మళ్లించినట్లు అనుమానిస్తున్న ప్రతి వ్యక్తికి సంబంధించిన అంశాలను సిట్ విడిగా పరిశీలించింది. వారి ద్వారా ఎంత మొత్తం దుర్వినియోగానికి గురై ఉండొచ్చన్న అంచనాలను కూడా నివేదికలో పొందుపరిచినట్లు సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నగదు లెక్కింపు, నిర్వహణ జరుగుతున్న సమయంలోనే లెక్కింపు గదిలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని తెలిపింది. అక్రమ నగదు తరలింపు ఘటనల గుర్తింపుతో పాటు, సంబంధిత వ్యక్తులను గుర్తించడం, వారిని విచారించడం, అనుమానిత అక్రమ సొమ్ము ఎక్కడికి వెళ్లిందో గుర్తించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని సిట్ వెల్లడించింది.

**ఆర్థిక లావాదేవీలు, ఆస్తులపైనా నిఘా**

దర్యాప్తులో భాగంగా నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. బ్యాంకు రికార్డులు, విరాళాలకు సంబంధించిన వివరాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, ఆర్థిక పత్రాలను పరస్పరం సరిపోల్చి చూస్తున్నట్లు సిట్ తెలిపింది. ఇప్పటివరకు 173 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు నివేదికలో వెల్లడించింది. వీరిలో రామమందిర ట్రస్ట్‌కు చెందిన అధికారులు, అకౌంటింగ్ సిబ్బంది, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, చార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు.

**803 విలువైన వస్తువుల్లో వ్యత్యాసాలు లేవు**

మరోవైపు, రామమందిరానికి అందిన విలువైన వస్తువుల విషయంలో సిట్ తనిఖీలు నిర్వహించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరిచిన 803 విలువైన వస్తువులను భౌతికంగా పరిశీలించినట్లు నివేదిక తెలిపింది. ఈ వస్తువులకు సంబంధించి టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించిన రసీదులను కూడా పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులు ట్రస్ట్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. లాకర్‌లోని వస్తువులను ప్రత్యక్షంగా తనిఖీ చేసిన అనంతరం, వాటిలో ఎలాంటి వ్యత్యాసాలు కనిపించలేదని సిట్ స్పష్టం చేసింది. రసీదులు జారీ చేయని మరో 86 విలువైన వస్తువులను కూడా విడిగా గుర్తించి భౌతికంగా తనిఖీ చేసినట్లు నివేదిక పేర్కొంది.

**944 కిలోల వెండిపైనా పరిశీలన**

రామమందిర ట్రస్ట్ వద్ద ఉన్న వెండి నిల్వలకు సంబంధించిన రికార్డులను కూడా సిట్ పరిశీలించింది. సుమారు 944.411 కిలోల వెండిని కరిగించేందుకు ట్రస్ట్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు పంపినట్లు నివేదికలో పేర్కొన్నారు. అదే సమయంలో సుమారు 200 కిలోల వెండి ఇటుకలు, మరో 38.288 కిలోల వెండి ఇటుకలు, వెండి హారం, చరణ్ పాదుక, రామచరితమానస్‌కు సంబంధించిన విరాళం వంటి అంశాలను కూడా సిట్ పరిశీలించింది. వీటి నిర్వహణలో ఎలాంటి వ్యత్యాసాలను గుర్తించలేదని దర్యాప్తు బృందం తెలిపింది. ఉత్తరప్రదేశ్ పోలీస్ ఐజీ కిరణ్ ఎస్ నేతృత్వంలో సిట్ ఈ దర్యాప్తును కొనసాగిస్తోంది. మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలను కూడా బృందం పరిశీలించినట్లు నివేదిక వెల్లడించింది. సోమవారం సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సెప్టెంబర్ 25లోపు సిట్ తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందని ధర్మాసనానికి తెలిపారు





# 'చాణక్య'లో అన్నప్రసాద వితరణ కార్యక్రమం

**మానకొండూరు, తెలంగాణ చౌరస్తా:**

మండల కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ప్రతిరోజూ ఉదయం,సాయంత్రం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు స్వామి వారిని కొలుస్తున్నారు.విఘ్నాలు తొలగించి తమ కుటుంబాల్లో ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు కలగాలని గణపతిని వేడుకుంటున్నారు.వివిధ రకాల నైవేద్యాలను సిద్ధం చేసి గణనాథుడికి సమర్పించారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మహా నైవేద్య కార్యక్రమాన్ని చేపట్టారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆడెపు మాట్లాడుతూ... విద్యార్థులకు దైవభక్తి,మంచి నడవడి ఇలాంటి కార్యక్రమాల ద్వారా అలవ డుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజధానిలో భారీ వర్షం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, గాంధీనగర్, దుండిగల్, రామనగర్, అంబర్‌పేట, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఎస్ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకపూల్, సైదాబాద్, ఐఎస్‌సదన్, మదనపేట్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, చంపాపేట్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు చేరింది. రహదారులపైకి నీరు చేరడంతో మాదాపూర్, టోలీచౌక్ వంతెనపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. హైదరాబాద్‌లో వర్షాల దృష్ట్యా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. మున్సిపల్ కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్లు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు



చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో వర్షాల దృష్ట్యా అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గణేశ్ నిమజ్జనాల దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఇబ్బందులు రాకుండా చూడాలని తెలిపారు. అత్యవసర ప్రయాణాలు మినహా మిగిలిన వాటిని వాయిదా వేసుకోవాలని సూచించారు.

**ఆరెంజ్ హెచ్చరికలు జారీ**


వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో ఇవాళ, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. నేడు 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. భూపాలపల్లి, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# సర్దుబాటు - వివాహ వ్యవస్థను దృఢం చేస్తుంది

**వివాహం అంటే అమ్మాయి, అబ్బాయి కలవడం మాత్రమే కాదు, రెండు మనస్సులు, రెండు కుటుంబాలు, రెండు భిన్నమైన జీవన విధానాలు ఒకటిగా మార్చే బంధమే వివాహబంధము. వివాహం తర్వాత భార్యాభర్తలు కలిసి జీవించడమే కాకుండా, ఒకరి కుటుంబాన్ని మరొకరు గౌరవించడం, ఒకరి సంప్రదాయాలను మరొకరు అర్థం చేసుకోవడం, అవసరమైన సందర్భాల్లో సర్దుకుపోవడం ద్వారా మాత్రమే ఆ బంధం బలపడుతుంది. ప్రస్తుత కాలంలో వివాహాల సంఖ్య తగ్గడం కంటే, వివాహ బంధాలు ఎక్కువ కాలం నిలవకపోవడం ఒక ఆందోళనకరమైన అంశంగా మారుతోంది. చిన్న చిన్న అపార్థాలు, అహంకారం, అధిక అంచనాలు, కుటుంబ సభ్యుల జోక్యం, ఆర్థిక విషయాలు, ఉద్యోగ ఒత్తిళ్లు, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అభిప్రాయ భేదాలు వంటి అనేక కారణాలు భార్యాభర్తల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి.**



ఇలాంటి పరిస్థితుల్లో సర్దుబాటు అనే లక్షణం వివాహ బంధానికి ఒక బలమైన పునాది. వివాహం జరిగిన రోజుతో ఇద్దరు వ్యక్తుల జీవితాలు మాత్రమే మారవు. రెండు కొత్త కుటుంబాలు ఒకరికొకరు దగ్గరవుతాయి. రెండు ఇళ్లలో పెరిగిన వ్యక్తులు ఒకే ఇంట్లో జీవించాల్సి వస్తుంది. వారి ఆలోచనలు, అలవాట్లు, అభిరుచులు, ఆచారాలు, ఆహారపు పద్ధతులు, మాట్లాడే తీరు, కుటుంబ సంబంధాలు వేర్వేరుగా ఉండవచ్చు. ఒక అమ్మాయి తన పుట్టింట్లో ఒక విధమైన వాతావరణంలో పెరిగి ఉండవచ్చు. ఒక అబ్బాయి తన కుటుంబంలో మరో విధమైన వాతావరణంలో పెరిగి ఉండవచ్చు. వివాహం తర్వాత ఇద్దరూ ఒకే విధంగా ఆలోచించాలి అనుకోవడం సాధ్యం కాదు. అందుకే వివాహ జీవితంలో మొదట అవసరమయ్యేది "నా విధానమే సరైనది" అనే భావనను వదిలి, "మనకు సరైన విధానం ఏమిటి?" అని ఆలోచించడం. చాలామంది సర్దుకుపోవడాన్ని బలహీనతగా భావిస్తారు. ఒకరి మాటకు మరొకరు ఒప్పుకుంటే తాము తగ్గిపోయినట్లు భావిస్తారు. కానీ నిజమైన సర్దుబాటు అంటే ఓటమి కాదు. అది సంబంధాన్ని కాపాడుకోవడానికి తీసుకునే పరిపక్వమైన నిర్ణయం. భార్య ఒక విషయంలో భర్త అభిప్రాయాన్ని గౌరవించడం, భర్త మరో విషయంలో భార్య అభిప్రాయానికి విలువ ఇవ్వడం ఇదే ఆరోగ్యకరమైన సర్దుబాటు. ప్రతి విషయంలో ఎవ్వరికి వాళ్ళు నేనే గెలవాలని ప్రయత్నిస్తే కుటుంబంలో ఎవరూ గెలిచినట్లు కాదు, ఇద్దరూ కలిసి గెలిచినప్పుడే కుటుంబం గెలిచినట్లు. ప్రతి కుటుంబానికి కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. పండుగలను జరుపుకునే విధానం, పెద్దలను గౌరవించే పద్ధతి, ఇంటి ఆచారాలు, కుటుంబ కార్యక్రమాలు, బంధువులతో సంబంధాలు ఇవన్నీ భిన్నంగా ఉండవచ్చు. వివాహం తర్వాత తన కుటుంబ సంప్రదాయాలనే పాటించాలని ఒకరు పట్టుబడితే సమస్యలు రావచ్చు. అదే సమయంలో ఎదుటి వారి సంప్రదాయాలను పూర్తిగా తిరస్కరించడం కూడా సరికాదు. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గౌరవించాలని వత్తిడి తీసుకరావడం సమస్యలు సృష్టికి కారణం. ప్రతి ఆచారాన్ని అనుసరించాల్సిన అవసరం లేదు. ముందుగా దాని వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవాలి. గౌరవం ఉన్న చోటే అనుబంధం పెరుగుతుంది. వివాహ బంధానికి ప్రేమ ఎంత ముఖ్యమో గౌరవం కూడా అంతే ముఖ్యమైనది. ప్రేమ తగ్గిపోవచ్చు, పెరగవచ్చు కానీ పరస్పర గౌరవం ఉంటే అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చు. భర్త భార్య అభిప్రాయాన్ని వినాలి. భార్య కూడా భర్త అభిప్రాయాన్ని గౌరవించాలి. ఒకరి ఉద్యోగాన్ని, కష్టాన్ని, సమయాన్ని, బాధ్యతలను మరొకరు అర్థం చేసుకోవాలి. ఇంట్లో చేసే పనికి విలువ ఉండాలి. సంపాదించే వ్యక్తి మాత్రమే కుటుంబానికి ముఖ్యుడు కాదు. ఇంటిని నిర్వహించే వ్యక్తి కూడా కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారు. కుటుంబంలో బాధ్యతలు పంచుకోవడం అనేది ఉపకారం కాదు, భాగస్వామ్యం. ఈ రోజుల్లో అనేక కుటుంబ సమస్యలకు ఆర్థిక విషయాలు కూడా ఒక కారణంగా మారుతున్నాయి. ఆదాయం ఎంత? ఖర్చులు ఎంత? పొదుపు ఎలా చేయాలి? ఎవరి కుటుంబానికి ఎంత సహాయం చేయాలి? అప్పులు ఎలా తీర్చాలి? భవిష్యత్తు కోసం ఎలా ప్రణాళిక చేసుకోవాలి? వంటి విషయాల్లో ముందుగానే స్పష్టమైన చర్చ అవసరం. భర్త సంపాదన తనదే, భార్య సంపాదన తనదే అనే భావన కన్నా, కుటుంబ భవిష్యత్తు కోసం కలిసి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. అయితే సర్దుబాటు పేరుతో ఒకరి సంపాదనపై మరొకరు పూర్తి నియంత్రణ సాధించడం కూడా సరికాదు. ఆర్థిక స్వేచ్ఛతో పాటు ఆర్థిక బాధ్యత కూడా ఉండాలి. వివాహం తర్వాత అమ్మాయికి పుట్టింటి అనుబంధం తగ్గిపోవాలని ఆశించడం ఎంత తప్పో, అబ్బాయి తన కుటుంబాన్ని పూర్తిగా దూరం చేయాలని ఆశించడం కూడా అంతే తప్పు. భర్త తన భార్య పుట్టింటిని గౌరవించాలి. అదే విధంగా భర్త కుటుంబాన్ని భార్య గౌరవించాలి. రెండు కుటుంబాల మధ్య పోలికలు పెట్టడం, "మా ఇంట్లో ఇలా ఉండదు", "మీ ఇంటి వాళ్లే ఇలా చేస్తారు" అంటూ విమర్శించడం సమస్యలను మరింత పెంచుతుంది. రెండు కుటుంబాలను పోటీగా చూడకుండా, రెండు కుటుంబాలను మన కుటుంబాలుగా చూడగలిగితే వివాహ బంధం మరింత అందంగా మారుతుంది. అహంకారం బంధానికి శత్రువుగా మారుస్తుంది. "నేనే ఎందుకు తగ్గాలి?" అనే ప్రశ్న అనేక కుటుంబాల్లో సమస్యలకు కారణమవుతోంది. ప్రతి విషయానికీ తనదే పైచేయి కావాలని ప్రయత్నించడం వల్ల ప్రేమ ఉన్నా దూరం పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఒకరు ముందడుగు వేయాలి. మరి కొన్ని సందర్భాల్లో మరొకరు ముందుకు రావాలి. తప్పు చేసినప్పుడు "క్షమించు" అని చెప్పడం చిన్నదనం కాదు. మనస్పర్థలు వచ్చినప్పుడు మాట్లాడుకుని పరిష్కరించుకోవడం పరిపక్వత. క్షమాపణ చెప్పగలిగిన మనస్సు, క్షమించగలిగిన హృదయం ఉన్న కుటుంబంలో బంధం ఎక్కువ కాలం నిలుస్తుంది,దృఢంగా మారుతుంది. ప్రతి విషయంలో కుటుంబ సభ్యుల జోక్యం అవసరం లేదు. భార్యాభర్తల మధ్య చిన్న సమస్య వచ్చిన ప్రతిసారీ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులను మధ్యలోకి తీసుకురావడం సమస్యను మరింత పెద్దది చేయవచ్చు. ప్రతి కుటుంబానికి తమ సమస్యలను తామే పరిష్కరించుకునే అవకాశం ఇవ్వాలి. పెద్ద సమస్యలు వచ్చినప్పుడు పెద్దల సలహా తీసుకోవచ్చు. కానీ ప్రతి చిన్న విషయాన్ని బయటకు తీసుకెళ్లడం వల్ల అపార్థాలు పెరుగుతాయి. సర్దుబాటుకు కూడా హద్దులు ఉన్నాయి సర్దుబాటు అంటే అన్నింటినీ భరించడం కాదు. అవమానం, హింస, వేధింపులు, మోసం, వ్యసనాలు, ఆర్థిక దోపిడీ వంటి తీవ్రమైన సమస్యలను "సర్దుకుపోవాలి" అంటూ సమర్థించడం సరైంది కాదు. వివాహ బంధంలో ప్రేమతో పాటు గౌరవం, భద్రత, స్వేచ్ఛ, సమానత్వం కూడా ఉండాలి. మనస్పర్థలు వస్తే ముందుగా ఎవ్వరికి వాళ్ళు ఒంటరిగా ఆలోచించాలి, తప్పు ఎవరివైపు ఉంటే క్షమాపణ కోరుకోవాలి, క్షమించే గుణాన్ని పెంపొందించుకోవాలి, ఇంకా ఎక్కువ ఇబ్బందులు జరిగితే దాని గురించి మాట్లాడాలి. అవసరమైతే కుటుంబ పెద్దలు, నిపుణులు లేదా తగిన సహాయ వ్యవస్థలను సంప్రదించాలి. ఆరోగ్యకరమైన సర్దుబాటు అనేది ఇద్దరి గౌరవాన్ని కాపాడే విధంగా ఉండాలి. నేటి యువత విద్యావంతులు. ఉద్యోగాలు చేస్తున్నారు. తమ జీవితంపై తమకు స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఇది మంచి పరిణామమే. అయితే వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు కుటుంబ బాధ్యతను కూడా అర్థం చేసుకోవాలి. వివాహానికి ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవడం, భవిష్యత్తు లక్ష్యాలు, ఉద్యోగం, నివాసం, ఆర్థిక వ్యవహారాలు, పిల్లల గురించి అభిప్రాయాలు, కుటుంబ బాధ్యతలు వంటి విషయాలపై స్పష్టంగా మాట్లాడుకోవడం అవసరం. వివాహం అనేది జీవితాంతం కలిసి నడిచే ప్రయాణం. అందులో ఎప్పుడూ సంతోషమే ఉండదు. కొన్ని రోజులు ఆనందంగా ఉంటాయి. కొన్ని రోజులు సమస్యలతో ఉంటాయి. సంతోషంలో కలిసి నవ్వడం ఎంత ముఖ్యమో, కష్టాల్లో కలిసి నిలబడటం అంతకంటే ముఖ్యం. వివాహ జీవితంలో ప్రేమ మొదట ఆకర్షణగా ప్రారంభమవుతుంది. కాలం గడిచేకొద్దీ ఆ ప్రేమ బాధ్యతగా మారాలి. ఒకరి ఆరోగ్యం గురించి మరొకరు ఆలోచించడం, అలసిపోయినప్పుడు అండగా నిలవడం, వైఫల్యంలో ధైర్యం చెప్పడం, విజయాన్ని కలిసి జరుపుకోవడం ఇవే నిజమైన దాంపత్య జీవితానికి గుర్తులు. ఒకరి బలహీనతలను మరొకరు ఎగతాళి చేయకుండా, బలాలను ప్రోత్సహించాలి. బయట ప్రపంచం ముందు ఒకరినొకరు గౌరవించాలి. వ్యక్తిగత విషయాలను అందరి ముందు చర్చించకుండా గోప్యతను కాపాడాలి. వివాహం అనేది ఒక రోజు జరిగే వేడుక కాదు. ప్రతిరోజూ ఇద్దరూ కలిసి నిర్మించుకునే జీవితం. పెళ్లి రోజున ఇచ్చే హామీల కంటే, ఆ తర్వాత జరిగే పరిణామాలను, పరిస్థితులను అర్థం చేసుకొని ముందుకు సాగడం ముఖ్యం. వివాహ బంధం బలపడాలంటే ప్రేమ ఉండాలి. ప్రేమ నిలవాలంటే గౌరవం ఉండాలి. గౌరవం నిలవాలంటే పరస్పర అవగాహన ఉండాలి. అవగాహన పెరగాలంటే ఓర్పు ఉండాలి. ఈ అన్నింటినీ కలిపి నిలబెట్టేది సర్దుబాటు. సర్దుకుపోవడం అంటే తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడం కాదు. ఎదుటివారి మనస్సును అర్థం చేసుకోవడం. తన అభిప్రాయానికి ఎంత విలువ ఇస్తామో, ఎదుటివారి అభిప్రాయానికి కూడా అంతే విలువ ఇవ్వడం. వివాహం అంటే "నేను" నుంచి "మనం" వైపు చేసే ప్రయాణం. అమ్మాయి తన ఇంటిని వదిలి వస్తుంది కాబట్టి ఆమె మాత్రమే సర్దుకోవాల్సిన అవసరం లేదు. అబ్బాయి కూడా తన జీవితంలోకి వచ్చిన కొత్త వ్యక్తిని అర్థం చేసుకోవాలి. ఇద్దరూ ఒక అడుగు చొప్పున ముందుకు వేస్తేనే కుటుంబ జీవితం సంతోషంగా సాగుతుంది. కుటుంబ వ్యవస్థ దృఢంగా మారుతుంది, కుటుంబ వ్యవస్థ దృడంగా మారితే సమాజం సానుకూలమైన మార్పు దిశగా ప్రయత్నిస్తుంది.



**వై. సంజీవ కుమార్,**
ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్,
9393613555 / 9493613555